# "గాంధీ నవ్వాడు!"

—ఈశ్వరచంద్ర విద్యాసాగర్

గాంధీ నవ్వాడు.

ఇప్పుడే కాదు. ఎప్పుడూ అలా నవ్వుతూనే వున్నాడు.

పవిత్ర భారతంలో ఎక్కడచూసినా నవ్వుతూనే కన్పిస్తుంటాడు.

అలా కన్పించే అనేకానేక గాంధీ మూర్తులలో ఒకటి మా బజారు చివర్లో వుంది.

ఆ మూర్తి ఈనాటిది కాదు. ఎన్నో సంవత్సరాల నుంచి, ఎండవానలు లెక్కచేయకుండా, ధీరత్వంతో కొండలా నిలబడి అక్కడ వుంది.

బిచ్చగాళ్ళు తాము అడుక్కొని తెచ్చుకున్న ఆహారాన్ని రోజూ ఆ మూర్తి చల్లనినీడలో ఆరగించి తమ ఆకలి తీర్చుకుంటారు. తననుగురించి, తన సిద్ధాంతాలను గురించి ఏమీ తెలియకపోయినా, తన నీడపట్టు నయినా సంతృప్తిని పొందుతున్న ఆ జీవులనుగూర్చి కాబోలు ఆ మూర్తి ఎప్పుడూ బోసినవ్వులు చిందిస్తున్నట్లు కన్పిస్తుంది.

ఇవన్నీ నేను రోజూచూసే దృశ్యాలే.

ఆ రోజు నేను మొదటిఆట సినిమా చూసి వస్తున్నాను. న్యూస్‌రీలులో గాంధీ జీవితానికి సంబంధించిన ఘట్టాలను చూపారు. అవి నేను మననం చేసికొంటూ ఆ మూర్తి దాపులకు రాగానే దానివంక ఒకమారు చూసాను.

అప్పటిదాకా గాంధీజీ సూచించిన రామరాజ్యస్థాపనా సిద్ధాంతాలను ప్రస్తుత పరిస్థితులతో అన్వయించుకొని ఆలోచిస్తున్న నేను అక్కడి దృశ్యం చూసి ఆగిపోయాను.

ఆ మూర్తి చుట్టూ నలుగురైదుగురు బిచ్చగాళ్ళు తాము యాచించి తెచ్చుకున్న ఆహారాన్ని తింటూ కూర్చున్నారు. ఇంకా కొంతమంది ఆ వేదికమీద అదమరచి నిద్రిస్తున్నారు. వాళ్లు కట్టుకున్న బట్టలు, వాళ్లు పరుచుకు పడుకున్న చిరుగుపాతలు వారి దారిద్ర్యాన్ని చాటిచెపుతున్నాయి.

కాని స్వతంత్ర భారతంలో ఇప్పటికీ మారని ఈ దరిద్రనారాయణుల పరిస్థితికి నా మనస్సు వికలమయింది. నా మనస్సులో ఎన్నో ఆలోచనలు ముసురుకున్నాయి.

ఆలోచనల ముసురులోనించి కదిలి ఇంటికి చేరి, భోజనం ముగించి పడుకున్నాను. నా మనస్సు వికలం అవడం కారణంగా నిద్రపట్టడంలేదు. ఆ నాటి స్వాతంత్ర్యయోధుల దీక్ష, నిర్భీతి, నిజాయితీ, నేటి నాయకుల కుటిల రాజనీతి, కప్పదాటు వ్యవహారం ఆలోచిస్తూ పడుకుంటే ఆదమరుపుగా కలతనిద్ర పట్టింది—

ఒక అందమయిన తోట. ఆహ్లాదకరమయిన వాతావరణం, ఆ తోటలో "రఘుపతిరాఘవరాజారాం" అనే మృదుమధుర శబ్దారావంతో, ఆనంద పార

వశ్యంలో ఓలలాడుతున్న జనంతో నిండివున్న నిరాడంబర కుటీరం. వాళ్ళలో భేదభావాలు, జాతిమత వైషమ్యాలు, ధనిక బీద తారతమ్యాలు లేవు. అంతా ఒకటే జాతి, అందరిదీ ఒకటే మతం, అంతా నడిచేది ఒకటే బాట. "ఈశ్వర అల్లా తేరేనామ్ సబ్‌కో సన్మతి దే భగవాన్" అని కలిసి మెలిసి పాడుకుంటూ, అన్నాదమ్ముల్లాగా మెలగుతున్నారు. ఎవరి పని వాళ్లు నిర్వర్తించుకుంటున్నారు. ఎవరి రొట్టె వాళ్ళు తింటున్నారు. ఆ దృశ్యం మనస్సుకు ఆహ్లాదం కలిగించి, ఆనందోద్రేకాలతో పరవశింపజేస్తున్నది—

ఇంతలో నల్లని శరీరాకారులు తెల్లని బట్టలు ధరించి, కొందరు డబ్బు సంచులతో, కొందరు కొరడాలతో, మరికొందరు పెద్దపెద్ద కుర్చీలతో అక్కడికి వచ్చి డబ్బు, కుర్చీలను చూపుతూ మావైపు రమ్మంటే మావైపు రమ్మని అక్కడి అమాయికులను కోరారు. డబ్బు తీసికొని కొందరు, కుర్చీలకు ఆశపడి కొందరూ వెళ్ళిపోయారు. ఎటూపోక, ఏమీ మాట్లాడక తమ పనులను తాము చేసికొంటున్న మిగిలిన జనాన్నికూడా తమవైపు ఆకర్షించుకొనడానికి ఎక్కువ మొత్తాలలో డబ్బును ఇవ్వజూపారు. వాళ్ళు వినకపోయేసరికి కొరడాలు చూపించి దండించి అయినా తమవైపు తిప్పుకోవాలని చూసారు. హింస ప్రారంభమయింది.

ఒక్కసారిగా ఆ ప్రదేశమంతా గందరగోళంతో, హాహాకారాలతో మార్మోగిపోయింది. అప్పటిదాకా అన్నదమ్ముల్లాగా కలిసివుండి, డబ్బుకి, స్థానానికి లొంగిన వాళ్ళుకూడా మిగిలినవాళ్ళను హింసించ నారంభించారు. ఆ అమాయకుల ఆక్రోశాలతో వాతావరణం భయంకరంగా తయారయింది.

గుండెల్ని పిండినట్లయింది. ఒక్కసారిగా ఆపండి అంటూ అరిచాను. వులిక్కిపడి లేచాను. కళ్ళు మంటలు పుడుతున్నాయి. తలంతా నాదుగావున్నట్లనిపించి, చల్ల గాలికోసం తలుపు తీసికొని వాకిట్లోకి వచ్చాను.

"లెగండెహె ! లెగండి ! ఎద్దుల్లాగా తొంగొని అంతా గలీజు సేత్తుండరు. లెండి లెండి. లెగమని సెప్తుంటే మీక్కాదుర దరిద్రపునాయాల్లారా !" అంటూ ఎవరో పెద్దగా అరుస్తున్నారు. లేవనివాళ్ళను కర్రతో అదిలిస్తున్నారు.

మాట్లాడకుండా పిల్లాపాపలను చంకనేసుకొని, నిద్రమొహాలతో, క్రింద పరుచుకున్న చిరుగుల గొంగళ్ళను భుజానవేసికొని, వలసపోతున్నవాళ్ళలా, ఆ వేదికమీద నిద్రపోతున్నవాళ్ళు వెళ్ళిపోయారు.

విషయ మేమిటో తెలిసికొందామని, కొంచెం ముందుకు వెళ్ళాను. ఆ పేటలోని యువకులు దూరం దూరంగావున్న ఎలెక్ట్రిక్ స్థంభాలకు సన్నటి పురికొసలను కట్టి, దానికి కాగితపు త్రివర్ణ పతాకాలను అంటిస్తున్నారు.

ఇంతకుముందు నిద్రపోతున్నవాళ్ళను లేపగొట్టిన మనిషి, ఆ యువకులమధ్యకు వెళ్లి చోద్యంచూస్తున్నట్లు చూడసాగాడు. ఆ యువకులలో ఒకరు, "ఒరే బండా ! అట్లా చూస్తూ నుంచోకపోతే, గబగబా రెండు బిందెల నీళ్ళు ఆ బొమ్మమీద గుమ్మరించి, నారపీచు తీసికొని తోమక" అన్నాడు.

నాకు వెంటనే, రేపు గాంధీ జయంతని స్ఫురించింది. ఆ ఆర్భాటమంతా అందుకే. బండాడు గబగబా కుండతో రెండుసార్లు విగ్రహంమీద నీళ్లు గుమ్మరించి, పీచుతో రుద్ది, ఇంకొక కుండెడు నీళ్ళు పోసాడు. గాంధీ బొమ్మ మొహాన ఇంత కుంకుమ మొత్తి, మెడలో ఒక నూలుదండ వేశాడు. (ఇదంతా చూస్తుంటే, శ్రాద్ధకర్మకు ముందు శవానికి చేసే అలంకరణలా అన్పించింది నాకు.)

"ఏంటి మాష్టారూ ! చూస్తున్నారు. రేపు గాంధీ జయంతి కదండీ. అందులో శతజయంతికూడా కలిసొచ్చింది. రేపు వేమంతా నాటకాలు, భరతనాట్యాలు ఏర్పాటు చేస్తున్నాము. మీరుకూడా తప్పకుండా రావాలి." అన్నాడు తెలిసిన కుర్రవాడొకడు. ప్రతి యేడూ, జనవరి 26 న, ఆగస్టు 15 న ఈ తంతు

జరుగుతూనే వుంటుంది. అట్లా జరిగినప్పుడల్లా, వీళ్ళంతా అక్కడి పురప్రముఖులిచ్చే డబ్బులు తీసికొని, చందాలు పోగుచేసికొని, రాత్రిళ్ళు మేలుకొని ఈ ఏర్పాట్లన్నీ చేయడం, ఆ సాయంత్రానికి నాటకాలు ఆడడం, మధ్యలో ఏదో తగాదా రావటం – అంతా మామూలే.

వీళ్ళ ఉత్సాహమంతా నాటకాలు వేయాలని, తిర గాలని కాని—ఆయన జయంతి సందర్భంగా, ఆ గాంధీ మహాత్ముని భోధలు మననం చేసికొని, దేశ పురోభి వృద్ధికి తామెంతవరకు సహాయపడదామా అనికాదు.

నెమ్మదిగా ఇంటికి తిరిగివచ్చి పడుకున్నాను. చల్ల గాలిలో అలా తిరిగి వచ్చానేమో వెంటనే నిద్రపట్టింది.

ఉన్నట్టుండి, ఎవరో ఆత్మీయులు చనిపోతే శోకాలు పెడుతున్నట్లుగా ఒక అదగొంతు వినబడ్డది. ఉలిక్కి-పడి లేచాను. గాంధీ బొమ్మవద్ద అమర్చబడ్డ మైకు లోంచి ఏదో తెలుగు సినిమాపాట కర్ణపుటాలు బద్ద లయ్యేలా వినిపిస్తున్నది. సాయంత్రందాకా అలా సినిమా రికార్డులతో ఆ పేటంతా మార్మోగిపోయింది.

ఈ మనస్సువుంది చూసారూ, అది ఎప్పుడూ మనం వద్దనుకుంటున్న వాటిపైపే మొగ్గుతూ వుంటుంది. ఆ సాయంత్రం అక్కడికి వచ్చే వక్తలు ఎవరో, ఏం మాట్లాడుతారో తెలిసినా, మనకు తెలిసిన నగ్నసత్యాలను, వారి మాటల గారడీలతో ఎలా ప్రజ లకు నచ్చచెప్పాలని ప్రయత్నిస్తారో వినాలనిపిస్తుంది. అదే ఉద్దేశ్యంతో సాయంత్రం సభకు హాజరయ్యాను.

రాత్రి అంటించిన త్రివర్ణ పతాకాల తోరణాలతో ఆ ప్రదేశమంతా శోభాయమానంగా అలంకరింపబడి వుంది. గాంధీ విగ్రహంవున్న వేదిక ముందరనే నాలు గయిదు బల్లలువేసి వేదిక నిర్మించారు. గాంధీ విగ్రహం చేతిలోని కర్రకు ఒక త్రివర్ణపతాకం తొడి గారు. ఒక పెద్ద గడబొంగును పాతి, పతాకావిష్కర ణకు ఆయత్తం చేశారు.

రావలసినవారు ఒక్కొక్కరే రానారంభించారు ఇంకా ఉపన్యాసకులు రాలేదేమో, వేదికమీద ఖాళీ కుర్చీలు వారికోసం నిరీక్షిస్తున్నాయి.

కాసేపటికి ఒక కారువచ్చి ఆగింది. అందులోనుండి మా వూరి చైర్మన్‌గారు, మా తాలూకా నాయకుడు దిగారు.

స్థానిక పెద్దలు ఎదురేగి వాళ్ళ మెడలో నూలు దండలు వేసి, వేదికదగ్గరకు తీసికొనివచ్చారు.

చైర్మన్‌గారు తన మెడలో వేసిన నూలుదండను గాంధీబొమ్మ మెడలో వేసి చిరునవ్వుతో వెనుదిరి గాడు. అదే చిరునవ్వుతో అనుయాయులవంక చూసేడు. అంతా ఒక్కసారి మిన్నుముట్టేట్లు కరతాళ ధ్వనులు గావించారు.

మా తాలూకా నాయకుడుగారు పతాకావిష్కరణ చేసిన తరువాత అక్కడి పెద్దలలో ఒకరు స్టేజిమీద కొచ్చి ఆహూతులకు స్వాగతం పలికాడు.

అందరూ చప్పట్లు కొట్టారు. ఆ కరతాళధ్వనుల మధ్య నాయకులిద్దరూ వేదిక నలంకరించారు. చక్కని ఎర్రగులాబులు, చామంతులతో కలిపి కట్టిన నిలువెత్తు దండలను వారి మెడలో వేశారు. ముందు వరుసలో కూర్చున్న కుర్రకారు గారడీవాని ఆట చూస్తూచప్పట్లు కొట్టే ప్రేక్షకులలాగా మళ్ళీ చప్పట్లు కొట్టారు.

చైర్మన్‌గారు, వారు ధరించిన తెల్లని ఖద్దరు దుస్తుల లాంటి చిరునవ్వుతో, మెడలోనుండి దండతీసి ముందున్న టేబిల్‌మీద పెట్టి, ఒకసారి గొంతు సవరించుకొని,—

"సోదర సోదరీమణులారా! మీరంతా ఈనాడు... నన్ను...ఈ అధ్యక్షపీఠాన్ని అలంకరింపమని కోరి నందుకు, నాకు...చాలా ఆనందంగావుంది. ముఖ్యంగా నేను చెప్పదలుచుకున్న దేమిటంటే, నాకు...ఎందుకో ఈ వూరి ప్రజలంటే చాలా అభిమానం. అలాగే వారికి నేనంటే అభిమానం. ఆ అభిమానంతోటే నన్ను

ఇన్నిమార్లు చైర్మన్‌గా ఎన్నుకున్నారు—(అంతా ఒట్టి మాట. కౌన్సిలర్లను. డబ్బుతో కొని, కొంతమందిని ఎన్నికరోజున పైవూళ్ళకు పంపి, గెలిచిందిమాత్రం వాస్తవం.)—ఇది ప్రజాయుగం. గాంధీ మహాత్ముడు కలలుగన్న రామరాజ్య స్థాపనకు మనమంతా ప్రతీకలం. అందుచేత ఈనాడు ఆయన కలలను ఫలింప చేస్తామని మనమంతా శపథం చేద్దాము. ఈనాటి మన పురోభివృద్ధికి కారణం, ఆయన మన వెనుక నిలచి-మనకిచ్చిన అండదండలే ముఖ్యకారణం" అంటూ స్టేజీవెనుక-తన వారసులు తనకు ఆపాదిస్తున్న కీర్తనలను, ఆశ్చర్యంతో నోరు తెరిచి వింటున్నట్లున్న—గాంధీ విగ్రహాన్ని చూపాడు. ఎవరో గ్లాసులో ఇచ్చిన డ్రింక్‌ని తాగి, "అందుచేత మనం ఆయన సిద్ధాంతాలను తు.చ. తప్పకుండా..."—

ఉన్నట్టుండి స్టేజి ముందువయిపు గలాభా ప్రారంభమయింది. కుర్చీలలో కూర్చున్నవారు లేచి చూడసాగారు.

నలిగి, చిరిగిన బట్టలతో, మాసిన గడ్డంతో, సంస్కారంలేని జుట్టుతో, లోతుకుపోయిన కళ్ళతో, సన్నగా పొడవుగావున్న ఒక యువకుడు, ముందు వరుసలో కూర్చొన్న వి. ఐ. పి. ల ప్రక్కగావున్న ఒక ఖాళీకుర్చీలో కూర్చొన్నాడు. అతను సంస్కారహీనంగావున్నా అతని కళ్ళలో తేజస్సు కనిపిస్తుంది.

అసహ్యంగా కనిపించినందువల్లనేమో, ప్రక్కనే కూర్చొన్న ఆ వూరి బిజినెస్ మాగ్నెట్ రామానుజ సెట్టి, అతనివైపు చీదరగా చూస్తూ, పక్కనున్న వలంటీర్ని పిలిచి. "ఈ రోగ్స్ నందర్నీ ఇక్కడి కెందుకు వదిలావు, వెనక వరసలో కూర్చోపెట్టక," అన్నాడు.

"మిష్టర్ సెట్టి! హు ఆర్ రోగ్స్? ముందు మర్యాదగా మాట్లాడటం నేర్చుకోండి. వేషభాషలతోను, డాబుదర్పాలతోను మనిషిఔన్నత్యం కొలిచే రోజులివి. అందుకే దేశం ఇలా అఘోరిస్తున్నది. నీకు వున్నదిగాబట్టి నువ్వు మల్లుపంచెలు కట్టుకోగలవ్. టెర్లిన్ చొక్కాలు తొడుక్కోనగలవు. అవి లేనంత మాత్రాన నేను రోగ్‌నా? తుచ్ఛమైన డాబుదర్పాలతో, డబ్బుమదంతో పెట్రేగి, సభ్యతా సంస్కారం లేక ప్రక్కన కూర్చొన్న తోటిమానవుణ్ణి సహించగల సంస్కారంలేని నీవు రోగ్‌వా? లేక నేనా? గాంధీమహాత్ముని అడుగుజాడల్లో నడుస్తామని, ఆయన సిద్ధాంతాలను ఆచరణలో పెడ్తామని శపథం తీసుకున్నారే! మరి ఇదేనా నీ సభ్యత - సంస్కారం?" అంటూ ఉద్రేకపూరితమైన కంఠంతో ఆ యువకుడు అడుగుతుంటే నోటమాటరాక జనమంతా అవాక్కయిపోయి చూస్తూ నిలబడ్డారు.

తనప్రసంగానికి అంతరాయం కలిగించిన యువకుని వంక ఏవగింపుగా చూస్తూ, "ఏమిటీ గందరగోళం" అంటున్నట్లు వాలంటీర్ల వంక చూసాడు చైర్మన్‌గారు. వెంటనే ఇద్దరు దృఢకాయులు ఆ యువకుని రెక్కలు దొరకపుచ్చుకుని కుర్చీనుండి బయటకు ఈడ్చి, మెడమీద చేతులువేసి నెట్టుతూ ప్రక్కకు లాక్కుపోయారు. యువకుని మాటలను సమర్థిస్తూ సభలో కలకలం బయలుదేరింది.

"నిశ్శబ్దం...నిశ్శబ్దం... సోదరులారా! ఎవరో తిండికి లేక ఆకలిమంటతో అన్న మాటలను గురించి చర్చిస్తూ, అమూల్యమయిన సమయాన్ని దుర్వినియోగం చేయవద్దు. వాటిని గురించి మర్చిపొండి. ఇప్పుడు మన ఎల్లమందారావు గారు తమ అమూల్యమయిన ప్రసంగాన్ని మీకు వినిపిస్తారు. అందుచేత నేను ఇంతటితో విరమిస్తున్నాను." అంటూ, ఇంక ముందుకు ఏమీ మాట్లాడ లేక చైర్మన్‌గారు కూర్చున్నారు.

తాలూకా నాయకుడుగారు ఒకసారి నెత్తిమీద గాంధీటోపీని సవరించుకొని, పనిలో పనిగా గొంతు సవరించుకొని, "సోదరసోదరీమణులారా! భారత చరిత్రలో ఈ రోజు చాలా మంచిరోజు. గాంధీగారు

చాలా గొప్పమనిషి, ఆయన అందర్నీ సమానంగా చూడబట్టి అంతగొప్ప వాడయినాడని మీ అందరికీ నేను చెప్పనక్కర లేదని మనవి చేసికొంటున్నాను. ముఖ్యంగా ఆయన అమలుపరచిన సిద్ధాంతాలు ఏమి టంటే- ప్రతిమనిషిని ఆదరించాలి. ఆ మనిషి బీద కానీ, అంటరానివాడు కానీ, రోగిష్టి కానీ, ఏ మతస్థు డైనా కానీ, అతనిని మనమందరం తోటి సోదరుడుగా గౌరవించి, చేతనయిన సహాయం చేయాలి. అదే ప్రకారం మనంగూడా ప్రవర్తించాలని మనవిచేస్తు న్నాను. అదీ కాకుండా మరొక ముఖ్య విషయం ఏమి టంటే, మనిషికి ఎదుటివాడితో ఎలా మాట్లాడాలో తెలిసి వుండాలి. ఇంతకుముందు ఒక సోదరుడు మాట్లాడిన మాటలు మీరందరూ విన్నారు. అతనిలో శాంతస్వభావం లేదు. గాంధీగారు ఏమి చెప్పారు? ఏదైనా ఒక సమస్య ఉత్పన్నమయినప్పుడు ఉద్రేక పడకుండా ఎదుటివాడు ఒక దెబ్బవేసినా అహింసా విధానంతో, సృహృద్భావంతో దాన్ని పరిష్కరించు కోవాలిగాని ఉద్రేకంతో పొలికేకలు పెట్టినంతమాత్రాన ఫలితం చేకూరదు. అట్లాగే ఆ సోదరుడు మాట్లాడిన తీరు ఉద్రేకంతో కూడినదిగాని, సమస్యను పరిష్క రించ లేకపోయింది.

ఉదాహరణకు, నాకు ఎదురయిన ఒక సమస్య ఎలా పరిష్కరింపబడిందో చెబుతాను.

ఒకసారి నేను ఒక పల్లెటూళ్ళో, ఒక సభనుండి తిరిగి వస్తున్నాను. దారిలో ఒక యువకుడు బీదవాడే ననుకోండి, కాలిమీద గాయంతో అక్కడికి దగ్గరలో వున్న వైద్యునికి చూపించుకొనటానికి వెళ్తున్నాడు. నా మనస్సు చాలాబాధ పడింది. వెంటనే కారు ఆపి, వివరాలు కనుక్కున్నాను. ఆ వూళ్ళో వైద్యుడు లేడు. దాదాపు 5 లేక 6 మైళ్ళ దూరంలో వున్న వూరికి వెళ్ళాలి. అతన్ని ఆ బాధలో చూసి వెంటనే కారులో తీసుకొని వెళ్ళాలనే అనుకున్నాను. కాని నాకు ఇంకొక వూళ్ళో ఒకసభలో ప్రసంగించవలసిన అవ సరం వుండటం చేత, కాలం చాలా పరిమితంగా వుండటం చేత, ఆ వూరి వాళ్ళతో అతనికి తగిన ఏర్పాటు చేసి తీసికెళ్ళమని చెప్పి, నేను వెళ్ళి పోయాను. అందుచేత నేను మనవి చేసేదేమిటంటే, నేను కారులో తీసికొని వెళ్ళనంత మాత్రాన అతను ఆక్రోశించి నన్ను దూషించాడా? లేదు. సహనంతో అతనికి తగిన ఏర్పాటు జరిగేదాకా వేచి వున్నాడు. అందుచేత నేను చెప్పదలిచింది ఏమిటంటే ప్రతి వ్యక్తికి సహనం వుండాలి. అంతేకాని ఆవేశ పూరితమైన మాటలతో సమస్య ఏమైనా కానీ, పరి ష్కారం కాదు. కాబట్టి మీరంతా, గాంధీగారు చెప్పిన సిద్ధాంతాలను ఆచరణలో పెట్టి ఆయన ఆత్మకు శాంతిని కలిగించి, దేశపురోభివృద్ధికి దోహదం చేస్తా రని ఆశిస్తాను."

నాకెందుకో ఆ మాటలు వింటుంటే,-గాంధీజీ కనుక బ్రతికి వుంటే ఏమి చేసేవాడో ననిపించింది.

ఈ దేశనాయకుల మాటలను వినకుండా శిలా రూపంలో వున్న గాంధీ విగ్రహాన్ని చూసాను. ఆ వదనంలో నేను రాత్రి చూసిన బోసినవ్వు కని పించలేదు. ఆ కళ్ళలో ఆనందంతో కూడిన చిరునవ్వు కనిపించకపోగా, ఏదో బేలతనం కనిపిస్తున్నట్లని పించింది.

ఆయన కళ్ళనీళ్ళు పెట్టుకున్నట్లుగా తోచింది. నా వూహాలోకంలో నేనున్నాను. తాలూకా నాయకుడు గారి ప్రసంగం ఫుల్‌స్టాప్ లేకుండా సాగుతోంది.

ఇందాక బయటకు గెంటబడిన యువకుడు, గాంధీ గారి చేతిలోని కర్రని తీసి, తన రెండు చేతులతో పైకి ఎత్తిపట్టుకు నిలబడ్డాడు. అతని ఒళ్ళంతా రక్త సిక్తమయింది. తల పగిలిందేమో! చెవిపక్కగా రక్తం కారుతున్నది. అతని గుడ్డలు చినిగి పేలికలై వేళ్ళాడు తున్నాయి. జుట్టంతా చెదిరిపోయి మొహంమీద పడు తున్నది. క్రిందపడ్డాడేమో, మోచేతులకు మోకాళ్ళకు గాయాలు తగిలి మట్టికొట్టుకుపోయి వున్నాయి. అతని

కళ్ళు అగ్నిగోళాల్లా ఎఱ్ఱగా వున్నాయి. ఒకడుగు ముందుకు వేసి,

"దుర్మార్గులారా!...మీరంతా... చెట్టుపేరు చెప్పుకుని కాయలమ్ముకొనే వాళ్ళు. మీ స్వార్థానికి, అవినీతికి...శాస్తి జరుగుతుంది...మానవ సమానత్వం కావాలి అనికూస్తారా...మానవ సమానత్వం-"

అని దద్దరిల్లేటట్లు కేకలుపెడ్తూ, ఆ కఱ్ఱతో వేదిక మీద నాయకుల్ని చావమోదాడు.

వెంటనే పార్కంతా పోలీసు విజిల్సుతో, ఇనపనాడా బూట్ల చప్పుడుతో ప్రజల హాహాకారాలతో మార్మోగి పోయింది. ఇద్దరు కానిస్టేబుల్స్ వచ్చి ఆ యువకుని పెడరెక్కలు విరిచి పట్టుకుని లాక్కువెళ్ళి పోలీసు వ్యాన్‌లో పడదోసి తీసుకొనిపోయారు.

సభలోవున్న పెద్దమనుషుల్లో కొందరు దెబ్బలు తగిలిన నాయకులిద్దర్నీ తీసుకొనిపోయి కార్లో కూచో పెట్టారు.

ఆ గందర గోళంతో ఆనాటి సభ సమాప్తమయింది.

నాకెందుకో ఆ యువకుని చర్యచూస్తుంటే-గాంధీగారు బ్రతికివుంటే అలాగే చేసి వుండేవాడేమో ననిపించింది! అనుకోకుండా గాంధీ విగ్రహం వైపు చూసాను. ఆ విగ్రహం వదనంలో ఒక ఆనందం ఆ కళ్ళలో ఒక అనిర్వచనీయమైన వెలుగు, ఆ బోసి నవ్వులో "నేను చెయ్యలేనిపని నా సోదరుడు చేశాడు" అనే ఆనందాతిశయం కదలాడినట్లనిపించింది.

—o—

ఎటుచూస్తే అటు చీకటి,
అటు దుఃఖం, పటునిరాశ—
చెరసాలలు, ఉరికొయ్యలు
కాలువలో ఆత్మహత్య !
దగాపడిన తమ్ములార !
మీ బాధలు నే నెరుగుదును...

—శ్రీశ్రీ